ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర

## (శృంగవృక్షంలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 30.12.95)

ప్రియమైన ఆత్మ బంధువుల్లారా,

ఇంగ్లీషు తేదీలప్రకారము ఈరోజు భగవాన్ శ్రీరమణమహర్షి 116వ జయంతి. శ్రీ రమణమహర్షి 1879వ సంవత్సరము డిసెంబరు 29వ తేదీ రాత్రి ఒంటిగంటకు తిరుచ్చుళి అనే పుణ్యక్షేత్రంలో జన్మించారు. ఆయన 1896వ సంవత్సరము ఆగస్టునెల 29వ తేదీన గృహపరిత్యాగము చేశారు. 1896వ సంవత్సరము సెప్టెంబరు 1వ తేదీకి అరుణాచలం వచ్చారు.

శరీరము అంటే ఉపాధి. ఉపాధి వచ్చిన రోజును పుట్టినరోజు అంటున్నాము. ఉపాధి పోయిన రోజును మరణించినరోజు అంటున్నాము. భగవంతునికి పుట్టుకలేదు, మరణంలేదు. శరీరము పుడుతుంది, పెరుగుతుంది, మరణిస్తుంది. అన్ని శరీరమునకే. శరీరం పుట్టడం, శరీరం మరణించటం పొరపాటుకాదు. అందరి హృదయములలో అంతర్యామిగా ఉన్నానని భగవంతుడు చెపుతున్నప్పటికీ ఆయన మాటమీదగాని, ఆయన ఉనికిమీదగాని మనకు విశ్వాసము లేకపోవడం పొరపాటు.

మన అహంకారముమీద, మన తెలివితేటలమీద, మన రాగద్వేషములమీద మనకు నమ్మకం ఉంది. కాని ఏదైతే సర్వకాల సర్వావస్థలలో సజీవంగా ఉందో ఆ వస్తువుమీద మనకు నమ్మకం లేదు. ఆ వస్తువు మీద నమ్మకం లేకపోతే ఆ వస్తువు నీకు ఎరుకపడదు.

ఆత్మసుఖము, ఆత్మశాంతి మనకు దొరికితే ప్రపంచములో ఉన్న వస్తుజాలము అంతా మనకు తెల్ల చీమలలాగ కనబడతాయి అని పెద్దలు చెప్పారు. మనకు ఎక్కడయినా చీమ కనబడితే ఆకర్షణ కలుగుతుందా? కలుగదు. అలాగే బ్రహ్మానుభవం పొందినవాడికి ప్రపంచములో ఉన్న వస్తువులమీద ఆకర్షణ కలగదు. నిగ్రహించుకోవటంకాదు. సహజంగానే ఆకర్షణ కలుగదు. ఆ స్థితి అటువంటిది.

ఇంద్రియాలకు విషయాలకు అనుబంధము ఉంటుంది. ఒకో ఇంద్రియం ఒకో విషయం ఆకర్షిస్తుంది. ఆ విషయములను మనం అనుభవించటంవలన మనస్సు అపవిత్రం అవుతుంది. భగవంతుడు అత్యంత సమీపముగా మనస్సుయొక్క మూలములోనే ఉన్నప్పటికీ మనస్సులో ఉన్న అపవిత్రతవలన అది భగవంతుడిని నమ్మటానికి సిద్ధంగాలేదు.

మనస్సుయొక్క మూలం హృదయంలోనే ఉంది. అక్కడే భగవంతుడు ఉన్నాడు. మనో మూలమునకు నామములేదు, రూపములేదు. మనకు ఎంతసేపు రూపదృష్టి, నామదృష్టి. నామములకు, రూపములకు అలవాటు పడిపోయిన మనస్సు అంతర్ముఖం అవ్వటంలేదు, హృదయంలోనికి చేరుకోవటంలేదు, హృదయంలో ఉన్న వస్తువును పొందటంలేదు. రూపదృష్టి, నామదృష్టిలో బాగా పాతుకొనిపోయి ఉండటంవలన మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తోంది గాని అంతర్ముఖం అవ్వటంలేదు.

రమణమహర్షిగారు అరుణాచలంతో ఆకర్షించబడ్డాడు. అరుణాలేశ్వరుడే ఆయనను లాగుకొన్నాడు. ఆయనే భగవాన్ స్మృతిలోనికి వచ్చి, ఆయన ఎవరో తెలియచేసి, ఒక పిలుపు పిలిచి ఆయనే భగవాన్‌ను ఆకర్షించుకొన్నాడు.

గురువులు, సాధనలు, దేవతలు కూడా చేయలేని సహాయం అరుణాచలేశ్వరుడు చేస్తాడు అని భగవాన్ చెప్పారు. ఇది చెప్పటానికి ఎంత ధైర్యం ఉండాలో చూడండి. హృదయంలో ఆయన అనుభవించి చెపుతున్న మాటలు ఇవి.

ఊహించి చెప్పటం కాదు. ఆయన అనుభవంలోనుండి వచ్చిన మాటలు. సాధనలు, గురువులు, దేవతలు చేయలేని పనిని నీవు చేస్తావు అరుణాచలా అని భగవాన్ అన్నారు. ఈ మాట నా గుండెకు బాగా పట్టింది. అది ఆపుకోలేక మీకు చెపుతున్నాను అన్నారు శ్రీ నాన్నగారు. అయితే మీరు పెద్ద కష్టపడిపోనక్కరలేదు, ఎక్కువగా శరీరమును నలిపేసుకోనక్కరలేదు, కుదిపేసుకోనక్కరలేదు. అరుణాచలేశ్వరుడు మన హృదయంలోనే ఉన్నాడు. ఆ లోతులకు మీరు దిగలేరు. మీరు ప్రేమతో, ప్రీతితో ఆయన నామమును స్మరించినపుడు హృదయంయొక్క లోతులలోనికి ఆయనే మిమ్ములను గుంజుకుంటూ, గుంజుకుంటూ తీసుకొనిపోతాడు.

మేము నామము చేస్తున్నాము. శాంతి కలగటంలేదు. ఆందోళనగా ఉంది, అశాంతిగా ఉంది అని చెపుతూ ఉంటారు. మీకు ఏ కారణమువలన మనస్సులో అశాంతి వచ్చినా, ఆందోళన వచ్చినా ఈ జన్మలోగాని, పూర్వ జన్మలో గాని భగవంతుడు చేయవద్దని చెప్పిన పనులు మనం చేసినట్లే లెక్క. భగవంతుడు చేయవద్దని చెప్పిన పనులు ఈ జన్మలోగాని, పూర్వ జన్మలోగాని మనం చేయటంవలన ఆ పనే మనలో చిరాకుగా, ఆందోళనగా, అశాంతిగా వ్యక్తమవుతోంది.

భగవంతుడు కావాలి అని మీరు అనుకుంటే అహంభావనను వదులుకోవాలి. అహంభావన కావాలి అనుకుంటే భగవంతుడిని వదులుకోవాలి. రెండింటిలోనూ నీకు ఏదో ఒకటే అవకాశము ఉంది. నీకు అహంభావన కావాలి అనుకుంటే ఈ జన్మలోనేకాదు, కోటి జన్మలు ఎత్తినా దేవుడు దొరికేది లేదు. శివుడు కావాలంటే సైతానును వదులుకో. సైతాను కావాలంటే శివుడిని వదులుకో.

మనం సంసార సముద్రంలో ఉన్నాము. సంసార సముద్రము అంటే ఇంటిలోని మనుషులుకాదు. మనం జనన, మరణ ప్రవాహములో ఉన్నాము. ఇదే సంసార సముద్రము. ఈ సంసార సముద్రములోనుండి బయటకు రాలేకపోతున్నాము. ఎంతసేపు దానిలోనే తిరుగుచున్నాము. మధ్యలో పాడు స్నేహాలు దొరికితే అవి సుడిగుండంలాగ మనలను ముంచేస్తాయి. ఆ సుడిగుండంనుండి బయటకు రావాలంటే మరీ కష్టం. ఇంత ప్రమాదములో పడి ఉన్న మనలను ఇందులోనుండి మోక్షంఅనే ఒడ్డునకు తీసుకొని రావటానికి రమణమహర్షిలాంటి మహాగురువులను ఈశ్వరుడు పంపిస్తాడు. ఇదే రమణమహర్షి జన్మ. వారికి ఉపాధితో సంబంధములేదు. వారు కర్మ అనుభవించటానికిరాలేదు. వారు కారణ జన్ములు. మనం కర్మ అనుభవించటానికి వచ్చాము. వారికి ప్రయత్నంచేసి తొలగించుకోవలసిన బలహీనతలు ఏమిలేవు. వారు కారణ జన్ములు. మన హృదయంలో తొలగించుకోవలసిన బలహీనత ఒకటి ఉన్నప్పటికీ వాడు కారణ జన్ముడుకాదు. వారు చెప్పేది సత్యమునే ఆధారము చేసుకొని ఉంటుంది. వారు చెప్పిన మాట భగవంతునితో సమానము. ఏ కారణంవలన అయినా మనకు టెన్షన్‌వస్తే మనం సత్యంలో లేనట్లు గుర్తు. ఎందుచేతనంటే సత్యంలో టెన్షన్‌లేదు.

మేము నూతులు త్రవ్వించాము, చెరువులు త్రవ్వించాము, కాలువలు త్రవ్వించాము అని చెపుతూ ఉంటారు. కాలువలు త్రవ్విస్తే త్రవ్వించు. మనం వచ్చిన పని అదికాదు. జ్ఞానం సంపాదించాలి. మొదట దేవుడు తరువాత ప్రపంచము అన్నారు రామకృష్ణుడు. కాలువలు త్రవ్విస్తే త్రవ్వించు అది నీ జీవిత ధ్యేయంకాదు. జీవిత ధ్యేయం జ్ఞానమే.

భగవాన్‌కు మరణానుభవం ద్వారా జ్ఞానం కలిగింది. ఎందుకు మరణానుభవం కలిగింది అంటే ఎవరూ చెప్పలేము. అది దేవ రహస్యము. ఈశ్వరుడు మన హృదయంలో ఉండి ప్రారబ్ధము ప్రకారము నడిపిస్తూ ఉంటాడు. దేహము దాని ప్రారబ్ధముబట్టి నడుస్తుంది. భగవాన్ గురుస్థానము వహించటానికి వచ్చారు. మరణానుభవం ద్వారా గురువు అయ్యాడు. మరణానుభవం కలిగినపుడు ఆయన దేహము మరణించింది. దేహము మరణించినప్పటికీ మరణం లేని వస్తువు ఒకటి నా హృదయంలో ఉంది. శరీరం మరణించినప్పటికీ తాను చావులేని వాడను అని ఆయనకు తెలిసింది. ఇది ఊహలకు సంబంధించినది కాదు. ఇది ప్రత్యక్షానుభవం. అనుకోవటాలు గొడవలేదు. మరణం అంటే మనకు భయం. మరణానుభవం ద్వారా ఆయనకు మరణభయం పోయింది. మరణం లేని

వస్తువును ఆయన పొందాడు కాబట్టి ఆయనకు మరణభయం పోయింది. ఇదీ గ్రహించవలసినది.

ఒకోసారి మంచివారు కూడా పొరపాటు మాటలు మాట్లాడతారు. వారి హృదయంలో ఉన్న ఈశ్వరుడే ఈ మాటలను పలికిస్తాడు. మన దగ్గర సరుకు ఎంత ఉందో తెలుసుకోవటానికి అలాచేస్తున్నాడు. భగవాన్‌ను సమాధి స్థితి వచ్చి వరిస్తోంది. పుస్తకం చేతిలోనుండి జారిపోతోంది. అప్పుడు ఆయన అన్నగారు నీవు యోగిలాగ కనపడుతున్నావు. నీబోటివారికి ఇంటిదగ్గర పని ఏముంది. ఎక్కడికైనా పోరాదా అన్నాడు. అరుణాచలేశ్వరుడు ఆయన అన్నగారి హృదయంలో ఉండి ఆ మాటలు అనిపించాడు. ఈయన హృదయంలో జ్ఞాపకం వచ్చాడు. అరుణాచలం అనే స్ఫురణ ఆయన హృదయంలోనుండి వచ్చింది. అక్కడ మాటలు అనిపించింది ఇక్కడ స్ఫురణ కలిగించింది ఈశ్వరుడే.అంతా ఈశ్వర సంకల్పముతో నడుస్తోంది•కాని అంతా ఈశ్వర సంకల్పముతో నడుస్తోంది. అని మనకు తెలియటం లేదు. అది తెలుసుకోవటం కావాలి అన్నారు భగవాన్. అది తెలుసుకుంటే దుఃఖము నశిస్తుంది. అరుణాచలం వచ్చి నేను క్రొత్తగా పొందినది ఏది లేదు. ఏదైతే మధురలో పొందానో అదే చివర వరకు ఉంది అని భగవాన్ చెప్పారు. నాకు వచ్చిన అనుభవం ఎప్పుడూ అలాగే ఉండాలి, జారిపోకూడదు అని భగవాన్ ఎప్పుడూ అనుకోలేదట. అది జారిపోలేదు. చివరవరకు అలాగే ఉంది. వాడు ఋషి. ఎప్పుడైనా మంచి వార్తలు విన్నప్పుడుమనకు కూడా శాంతి కలుగుతూ ఉంటుంది. మనము జ్ఞానులము అయిపోయాము అనిపిస్తుంది. తరువాత రోజుకు ఏమీఉండదు.

దేవుడు, దేవుడు అని నీ దగ్గరకు వస్తే నన్ను పూర్ణ నాశనం చేశావు అరుణాచలా అన్నారు భగవాన్. ఆయనలో ఉన్న అన్ని సంస్కారములను నాశనం చేసాడట. భగవాన్‌ను లోకంలో ఏ విషయం ఆకర్షించలేదు ఎందుచేతనంటే మనస్సుకు ముండనము అయిపోయింది. ఆయనలో ఉన్న అహంభావనను నిశ్శేషంగా నశింపచేశాడు వాడు అరుణాచలేశ్వరుడు. ఆయన ప్రయత్నం చేసి పోగొట్టుకోవలసినవి ఏమీలేవు. నాకు బయట లోకం ఉందనే బుద్ధి కూడా నశించింది అన్నారు భగవాన్ ప్రతీ విషయానికి వారు ఏమనుకుంటారు, వీరు ఏమనుకుంటారు అని మనం అనుకుంటూ ఉంటాము. అలా అనుకొనేది అహంభావనే.

ఎవడైతే అరుణాచలా, అరుణాచలా అని స్మరిస్తున్నాడో వాడిమీద ఆయన కృప పడుతుంది. చంపకుండా చంపే మందు అరుణాచలం. అది నీ దేహమును చంపదు. నీ దేహబుద్ధిని చంపుతుంది. నీ ఇష్టము, అయిష్టములతో సంబంధములేకుండా ఆయనమీద నీకు ప్రేమ కలిగితే చివరిస్థితివరకు నిన్ను మోసుకొనిపోతాడు. నగ్న సత్యము దగ్గరకు నిన్ను తీసుకొనిపోతాడు.

రమణమహర్షిగారు 54సంవత్సరములు అరుణాచలంలో ఉన్నారు. అరుణాచలక్షేత్రంలో 54సంవత్సరాలు భగవాన్ ఉపాధి తిరుగాడింది. 54 సంవత్సరాలు ఇక్కడే ఉంటే ఈ అరుణాచలంను విడిచిపెట్టి ఇంకోచోటకు వెళ్ళాలి అనే సంకల్పము కూడా నాకు ఎప్పుడూ రాలేదు అన్నారు భగవాన్. వచ్చిన తరువాత నిగ్రహించుకోవటంకాదు. అరుణాచలంమీద ఆయనకు ఉన్నప్రీతి అటువంటిది. బ్రహ్మానుభవం పొందినవాడు బ్రహ్మమే. అందుచేత శరీరము ఉన్నా, లేకపోయినా వారు పనిచేస్తూనే ఉంటారు. పనిచేసేదిగాని, ప్రేమించేదిగాని శవంకాదు, బ్రహ్మమే.

మీద్వారా హద్దులు లేని ప్రేమను, శాంతిని మేముపొందాము. మరి మీరు లేకపోతే మమ్ములను ఎవరు ప్రేమిస్తారు అని కొంతమంది భక్తులు భగవాన్‌ను అడిగితే మిమ్ములను ప్రేమించేది ఈ శరీరమా అన్నారు. మిమ్ములను నేను ప్రేమిస్తాను అని మీరు అనుకుంటే ఈ శరీరము మిమ్ములను ప్రేమించేది. ఈ శరీరము మీకు శాంతిని కలుగజేసేది. ఏదైతే మిమ్ములను ప్రేమిస్తోందో అది ఈ శరీరము పడిపోయిన తరువాత కూడా ఉండనే ఉంటుంది. వాడు రమణమహర్షి అంటే. మిమ్ములను ప్రేమించే వస్తువుకు చావులేదు. శరీరముఉన్నా మిమ్ములను ప్రేమించేది శరీరముకాదు కాబట్టి శరీరము ఉన్నా, లేకపోయినా బ్రహ్మానుభవం పొందినవాడి ద్వారా మనకు శాంతి, జ్ఞానము అందుతూనే ఉంటాయి. ఇది నమ్మినవాడికి సొమ్ము. నమ్మనివాడికి దుమ్ము.

గురువు మన హృదయంలోనే ఉన్నాడు. హృదయంలో ఉన్న ఆయన స్థానము దగ్గరకు తీసుకొనిపోవటానికే ఆయన శరీరము ధరించివచ్చాడు. మనస్సు హృదయంలో ఉంటే దానిని అంతర్ముఖం అంటారు. మనస్సు హృదయమును

విడిచిపెట్టి బయటకు వస్తే అది బాహ్యముఖం అంటారు. ఏ విషయాలు నిన్ను బాహ్యముఖం చేస్తున్నాయోవాటినుండి నిన్ను విడుదలచేసి లోపల హృదయ స్థానంలోనికి తీసుకొని వెళ్లటానికి ఈ భూమిమీదకు వస్తాడు వాడు గురువు. పునర్జన్మకు హేతువులు అయిన సంస్కారములు అనేకం మనలో ఉంటాయి. మన స్వంత తెలివితో వాటిని తొలగించుకోలేము. వాటిని తొలగించుకోవటానికి గురువు సహాయంచేస్తాడు. నీ మనస్సు హృదయాభిముఖంగా ప్రయాణించటానికి సహాయపడేవాడే గురువు. నీ మనస్సును బాహ్యముఖం చేసే వాడు గురువుకాదు వాడు రాక్షసుడు అని భగవాన్ చెప్పేవారు.

గురువుచెప్పిన ఉపదేశము అనుసరించి నడవటమే. ఎందుకంటే గురువు, ఈశ్వరుడు వేరుకాదు. గురువు అనుగ్రహం ఉంటే ఈశ్వరానుగ్రహం ఉన్నట్లే. గురువు బోధ అంతా దేనిమీద ఆధారపడి ఉంటుంది అంటే నీ మనస్సును, నీలోని శక్తులన్నింటిని ఒకచోటకు తీసుకొని వచ్చి లోపలకు మళ్లించటమే. నీ తెలివిని, నీ శక్తిని లోపలకు మళ్లించటానికి గురువు చూస్తాడు. అదే గురువు చేసే పని. బయట పరిస్థితులు నీ మనస్సును లోపలకు తీసుకొని వెళ్లేలా సృష్టిస్తాడు. మీ అమ్మాయి అంటే మీకు బాగా ఇష్టం అనుకోండి. మీ అమ్మాయిచేత తిట్టిస్తాడు. ఇంత కష్టపడి పెంచాము. ఇదే మనలను తిడుతుంది. ఇంక దీని గొడవ మనకు ఎందుకు అని మీకు అనిపిస్తుంది. అప్పుడుగాని మీ మనస్సు లోపలకు తిరుగదు. మీ మనస్సు ఎక్కువగా ఎవరిమీద అయితే వ్రాలుతోందో వారిచేత రెండు మొట్టికాయలు మొట్టిస్తాడు. వారికోసం ఇంత కష్టపడుతున్నాము. వారే మొదుతున్నారు. ఇంక వీరి వెనకాల ఎందుకు తిరగాలి, ఎందుకు బ్రతకాలి అని మీకు అనిపిస్తుంది. అప్పుడుగాని మీ మనస్సు అంతర్ముఖం అవ్వదు. బయట చేసేపని గురువే. నీ లోపలచేసే పని గురువే. వాడు చేస్తున్నాడు అన్న సంగతి మనకు తెలియటంలేదు. ఎందుచేతనంటే మన అహంకారమువలన మనకు తెలియటంలేదు. గురువు చేసే పనివైపు మన కళ్ళు తెరువబడలేదు. అందువలన ఆయన చేసే పని మనకు కనబడటంలేదు.

హితులు మిమ్ములను విమర్శించినపుడు, హితులు మీకు మానసికంగా దూరమయినప్పుడు మీకు ఆలోచన ప్రారంభమవుతుంది. ఆలోచన ప్రారంభమయినపుడు నీ మనస్సు బాహ్యముఖంగా వెళ్లే వేగము తగ్గిపోయి లోపల ఏమిటి ఇలా ఉంది అనిపిస్తుంది. ఇలా ఆలోచన ఎప్పుడైతే ప్రారంభించావో నీ మనస్సు ఒక్కసారి రవ్వంత, ముల్లంత లోపలకు తొంగిచూస్తుంది. హృదయంవైపుకు చూస్తుంది. గురువు హృదయంలోనే ఉన్నాడు కదా. వీడు దొరికాడు, లోపలకు చూస్తున్నాడు అని ఆయన లోపలకు గుంజటం ప్రారంభిస్తాడు. లోపలకు వెళదామని మీ ఉద్దేశ్యంకాదు. బయట పరిస్థితులు ఇలా వ్యతిరేకంగా ఉన్నాయి. ఏమిటి అని ఒకసారి లోపలకు చూడటం మొదలు పెడతారు. మీరు ఎప్పుడు లోపలకు చూస్తారా అని ఆయన ఎదురు చూస్తున్నాడు కదా మీరు ఎప్పుడైతే లోపలకు చూడటం ప్రారంభించారో ఆయన గుంజటం ప్రారంభిస్తాడు. ఆ గుంజటం, గుంజటం ఆయన స్వరూపమును మీకు ఇచ్చేవరకూ మిమ్ములను వదలడు.

గురువు మాట అనుగ్రహము, గురువు చూపు అనుగ్రహము, గురువు ఆగ్రహముకూడా అనుగ్రహమే. గురువు మిమ్ములను గుంజుతాడు, విడిచిపెడతాడు. మరల గుంజుతాడు, విడిచి పెడతాడు. ఇలా కొంతకాలము మిమ్ములను Prepare చేస్తాడు. Preparationకు కొంతకాలము పడుతుంది. గాని కొన్ని క్షణాలలో ఆయన స్వరూపమును మీకు ఇచ్చేస్తాడు. Prepare అయ్యేటప్పుడు కొంత కష్టం అనిపిస్తుంది. ఆ కష్టం కలిగినప్పుడు ఈశ్వరుడు ఇలా చేస్తున్నాడు ఏమిటి అని మీకు అనిపిస్తుంది గాని బ్రహ్మానుభవంపొందాక ఈ కష్టం అంతా మీరు మర్చిపోతారు.

బయటనుండి లోపలకు తోస్తాడు. లోపలనుండి లోపలకు గుంజుకొంటాడు. నీ శరీరము మరణించినప్పటికీ నీవు ఎక్కడ ఉన్నావో చూసుకొని నీవు ఆత్మలో స్థిరపడేవరకూ నిన్ను విడిచిపెట్టడు వాడు గురువు. ఆత్మ జ్ఞానము నీకు అందేవరకూ నిన్ను విడిచిపెట్టడు వాడు గురువు. గురువు అంటే ఏదో అనుకోవద్దు. సత్యమును ఆయన చేతితో పట్టుకొని దానిని మనకు అందివ్వటంకోసం పడే తపన, జరిగే పోరాటం ఇది. సత్య వస్తువును మీకు అందజేయటంకోసం ఇది ఒక పోరాటం. మీరు దేనితో అయితే తాదాప్యం పొందుతున్నారో ఆ తాదాప్యంనుండి మీ మనస్సును విడదీసి

ఇప్పుడే, ఇక్కడే, ఈ శరీరంలో ఉండగానే ఆ వస్తువును మీకు అందజేయటంకోసం చెపుతున్న బోధ. దీనికి లౌకికమైన ప్రయోజనములు ఏమీలేవు.

ఏదైనా పని మొదలుపెట్టి పూర్తిచేశాము అనుకోండి. నా తెలివితేటలవలన, నా ప్రయత్నం వలన అది పూర్తిచేశాను అని చెపుతాడు. ఆ మనిషే ఒక పని చేయలేదు అనుకోండి.చేయలేకపోయాను అని చెప్పడు, ఈశ్వరుడు అనుకూలించలేదు అని చెపుతాడు. మనిషి తెలివితేటలు ఇలా సిద్ధమయ్యాయి. జరిగేది అంతా ఈశ్వర సంకల్పమే. అది తెలుసుకోవటం కావాలి. పని జరిగినపుడు ఈశ్వర సహాయంవలన జరిగింది అనుకోవటంలేదు. పని జరగనప్పుడు ఈశ్వరుడు అనుకూలించలేదు అంటున్నావు. నీ బుద్ధి ఇలా ఉంది. మనలోని అల్పత్వమును ఎత్తిచూపిస్తున్నాడు.

అహంకారము బాగా మదించిపోయిన ఏనుగులాంటిది. ఏనుగు ఒక్క సింహానికే లొంగుతుంది. గురువు చూపు సింహముతో సమానము. గురువు అనే సింహమునకే అహంకారము అనే ఏనుగు లొంగుతుంది గాని నీ బాహ్యప్రక్రియలవలన అది లొంగదు. ఆ చూపు ఎప్పుడైతే పడిందో శిష్యునియొక్క అహంకారము గజగజలాడి గిజగిజ కొట్టుకొని చస్తుంది. ఆ చూపు అంత బలీయమైనది. సింహము బయటకు వచ్చినపుడు అడవి జంతువులు అన్ని ఎక్కడివి అక్కడే అణిగిపోయి ఉంటాయి. బ్రహ్మానుభవం మన హృదయంలో ఎప్పుడైతే కలిగిందో ఈ ప్రాపంచిక గొడవలు అన్ని అలాగ అణిగిపోతాయి. హృదయంలో ఉన్న చైతన్యము నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు ఇంద్రియా[redacted]లకు సంబంధించిన గొడవలు, మనస్సుకు ఉన్న చాపల్యం అన్నీ అణిగిపోతాయి.

ఈశ్వరునికి అసాధ్యం అంటూ ఏదీలేదు. ప్రతీదీ సాధ్యమే. మనం చేసే సాధనలు, పూజలు అన్నీకూడా ఈశ్వరానుగ్రహం పొందటానికే. అనుగ్రహం లేకుండా ఆత్మానుభవం కలుగదు. దేవునియొక్క అనుగ్రహం లేకపోతే [redacted] దేవుని మాటయొక్క విలువకూడా మనకు తెలియదు. మనకు దేవుని వెనకాల వెళ్ళాలని ఉంది. కాని మన అజ్ఞానమును విడిచిపెట్టాలని లేదు. నన్ను వెంబడించాలంటే నీ అజ్ఞానమును విడిచిపెట్టు అంటున్నాడు భగవంతుడు.

జన్మలు ఎత్తి ఎత్తి సాధనలు చేయగా చేయగా ఈశ్వరానుగ్రహం పొందిన తరువాత నేను అనే తలంపులేని స్థితిలోనే వైకుంఠము ఉందని, ముక్తి స్థానం ఇక్కడే ఉందని నీకు తెలుస్తుంది. ఎక్కడో దూరాన ఉంది అనుకొన్నది ఇక్కడే ఉందని నేను అనే తలంపు కొంచముకూడా ఎక్కడ లేదో అక్కడే వైకుంఠము ఉందని, అక్కడే దేవుడు ఉన్నాడని నీకు అనుభవంలోనికి వస్తుంది. ఎక్కడో ఉంది అనుకొన్నది ఇక్కడే ఉంది అని ఎప్పుడో వస్తుందని అనుకొన్నది ఇప్పుడే వచ్చేసింది అని ఈశ్వరానుగ్రహం పొందిన తరువాత నీకు తెలుస్తుంది.

నీకు నేను అనే తలంపు ఉంది. దానికి ఒక మూలం ఉంది. అది నీ హృదయంలోనే ఉంది. నీ శరీరమునకు ఆకారము ఉంది, నీవు ఉపాసించే దేవునికి ఆకారము ఉంది. కాని నేను యొక్క మూలమునకు ఆకారము లేదు. నీవు జన్మజన్మలనుండి ఏదో ఒక ఆకారమునకు అలవాటుపడి ఉంటున్నావు. ఇప్పుడు ఒకే రోజులో అకారములేని ఆ మూలమును అందుకోవటం నీకు కష్టంగా ఉంది. అది నీకు అర్థమయ్యేటట్లు చెప్పి, నీ బుద్ధికి గ్రహింపుశక్తిని కలుగచేసి నీ చెయ్యి పట్టుకొని అక్కడకు తీసుకొని వెళ్ళటానికి వస్తాడు వాడు గురువు.

గురువు చెప్పిన మార్గములో నీవు ప్రయాణం చెయ్యటం ప్రారంభించు. గురువు అనుగ్రహం దానంతట అదే వస్తుంది. ఈశ్వరుని విశ్వసించటం ఎప్పుడైతే ప్రారంభించావో, ఈశ్వరునికి శరణాగతి పొందటం ఎప్పుడైతే ప్రారంభించావో, ఎప్పుడైతే నేనుయొక్క మూలమును అన్వేషించటం ప్రారంభించావో అప్పుడు అదును చూసుకొని పదును పెడతాడు వాడు గురువు. ఈశ్వర సంకల్పమును ఎప్పుడైతే గౌరవించటం నేర్చుకొంటున్నావో ఇదే అదును అనుకొని గురువు ఉపదేశము ప్రారంభిస్తాడు. గురువు టైము చూసుకొని మాట చెపుతాడు. అప్పుడు ఆమాట వాడికి పని చేస్తుంది.

మీపట్ల నాకు, నా పట్ల మీకు ప్రేమ, ఆప్యాయత ఉన్నాయి అనుకోండి ఎక్కువగా మాట్లాడుకోనక్కరలేదు. మీ మీద నాకు ప్రేమ లేనప్పుడు ఎక్కువగా మాట్లాడాలి. ఎందుచేతనంటే ప్రేమ లేదు అని తెలియకుండా ఉండడానికి ఎక్కువ మాట్లాడాలి.

మనిషికి శరీరములో రకరకాల రోగములు ఎలా అయితే ఉన్నాయో అలాగే మనస్సులో రకరకాల సంస్కారములు ఉన్నాయి. ఒకో సంస్కారము ఒకోరకంగా అహంకారమును వ్యక్తపరుస్తుంది. రోగమును తెలుసుకోవటానికి డాక్టరు శరీరమును ఎలా పరిశీలిస్తాడో అలాగే నీలో ఏవిధమైన సంస్కారములు ఉన్నాయో పరిశీలించుకోమని చెపుతున్నారు. ఏ సంస్కారము ఏ విధముగా అహంకారమును వ్యక్తము చేస్తోందో పరిశీలించుకొని దానిని తొలగించుకొనే ప్రయత్నం చెయ్యి. కొంతమంది వారు చేసిన మంచి పనులగురించి చెపుతూ ఉంటారు. వారు చేసిన మంచి చెప్పటం ద్వారా వారి అహంకారమును వ్యక్తపరుస్తున్నారు. ఇదోరకమైన సంస్కారము. ఇది గ్రహించండి. ముందుగుర్తించండి. రోగము ఏమిటో తెలియకుండా ఆరోగమునుండి బయటపడలేరు. అలాగే మీలో గుర్తింపు శక్తి లేకుండా గ్రహింపుశక్తి లేకుండా ఏ సంస్కారము మిమ్ములను పీడిస్తోందో గుర్తించకుండా మీరు అందులో నుండి బయటపడలేరు. మీలో దాగి ఉన్న వాసనలను కూడా కదిపి బయటకు లాగుతాడు గురువు. ఎందుచేతనంటే అవి అన్నీ పోతేగాని మోక్షస్థితిరాదు. అందుకువాటిని బయటకు లాగుతాడు. ఎప్పుడూ కూడా కనిపించే రోగము మంచిది. కనబడని రోగము ప్రమాదము. రోగము ఏమిటో తెలిస్తే దానికి తగిన మందు వాడతాము. ఒకడిశరీరమునకు కేన్సర్ వచ్చింది అనుకోండి. అది వాడికి తెలియకపోతే మనలాగే సరదాగా ఉంటాడు. అది ముదిరి చావటానికి సిద్ధంగా ఉన్న తరువాత తెలుస్తుంది. మనకు సంసారము ఎలా ఉంది అంటే కేన్సరు జబ్బు ఉన్నవాడు అది జబ్బు అని తెలియక ఎంత సంతోషముగా ఉంటాడో సంసారము అనేది జబ్బు అని తెలియక దానిలోని ప్రమాదం తెలియక మనం కూడా అంత సంతోషముగా ఉంటున్నాము మనం అందరము ఈ సంసారము గొడవలలో చాలా సంతోషముగా ఉంటున్నాము. ఎందు చేతనంటే ఇది జబ్బు అని మనకు తెలియటం లేదు. ఇది జబ్బు అని గ్రహింపు శక్తి రాలేదు. గుర్తింపు శక్తి మనకు రాలేదు. అందులో ఉన్న నిస్సారతను, అల్పత్వమును, అశాంతిని నీకు ఎత్తి చూపించి నీ హృదయాభిముఖంగా ప్రయాణించేటట్లు గురువు చేస్తాడు.

ఏ సంస్కారములు నీ అహంకారమును ఏరకంగా వ్యక్తపరుస్తున్నాయో జాగ్రత్తగా చూసుకొని ఒకటి తరువాత ఒకటి తొలగించుకొనే ప్రయత్నం చెయ్యి. నీలో ఉన్న సంస్కారములను తొలగించుకొనే ప్రయత్నం ఎప్పుడైతే ప్రారంభించావో అప్పుడు నీకు నిగ్రహం వస్తుంది. నిగ్రహం పెరిగేకొలది ఆగ్రహం తగ్గుతుంది. నీకు ఎంత ఐశ్వర్యం ఉన్నప్పటికీ, నిగ్రహం లేకపోతే నీవు సుఖపడలేవు.

నీలోపల అహంకారము ఉన్నంతసేపు నీవు ఎంత దాచుకుందామని అనుకొన్నా అది ఏదోరకంగా బయటకు వ్యక్తమవుతూ ఉంటుంది. జాగ్రత్త అవసరము. కొంతమంది కోపమును దాచుకుందామని అనుకొంటారు. టైమువచ్చినపుడు అది కళ్ళలో కంఠస్వరంలో వ్యక్తమయిపోతూ ఉంటుంది. కొంతమంది చుట్టాలు వచ్చినపుడు జాగ్రత్తగా ఉంటారు, మర్యాదగా ఉంటారు. వారు వెళ్ళిపోయిన తరువాత మామూలే. ఇదోరకమైన అహంకారము. రకరకాలైన సంస్కారములయొక్క చేష్టలు ఎలాగ ఉంటాయో, వాటి వికారములు ఎలా ఉంటాయో పరిశీలించుకొంటే మీకు తెలుస్తుంది. మీ మాట ద్వారా, మీ చేతద్వారా, మీ ఆలోచనద్వారా మీకు ఉన్న సంస్కారములను చూసుకొంటూ ఉంటే మీకు తెలుస్తాయి. తరువాత వాటిని తొలగించుకొనే ప్రయత్నం చేయవచ్చు.

నీ సంస్కారములతో నీవు పోరాడుతున్నావు కాని ఆ శక్తి సరిపోదు. నీవు సాధన చేయగా చేయగా ఈశ్వరుని పట్ల సజీవమైన విశ్వాసము హృదయములోనుండి పొంగివచ్చి నీ శిరస్సును ముంచుతున్నప్పుడు ఆ విశ్వాసములోనుండి ఒక శక్తి నీకు కలుగుతుంది. ఆ శక్తి నీ సంస్కారముతో పోరాడి వాటిని బయటకు లాగి వాటిని మంటపెడుతుంది. అప్పుడు నీకు జ్ఞానం కలుగుతుంది. అంటే గురువుపట్ల అచంచలమైన విశ్వాసము, గురువు చెప్పిన మాటలపట్ల విశ్వాసము నీకు కుదిరినపుడు నీకు శక్తి కలుగుతుంది. ఆ శక్తి నీలోని సంస్కారములను బయటకులాగి మంటపెడుతుంది. అప్పుడు నీవు జ్ఞానివి అవుతావు.